# చిన్నకథ

# హ్యాండ్ బ్యాగ్

ఉదయం పది గంటలు కావస్తోంది. విజయ వాడ రైల్వేస్టేషన్లో మైక్‌లో ''ఒక ముఖ్య ప్రకటన. ఒకటవ నెంబర్ ఫ్లాట్‌ఫాంలో ఒక సిమెంట్ బెంచీ మీద హ్యాండ్ బ్యాగ్ ఉంది. దాని దగ్గరకు ప్రయాణీకులెవ్వరూ వెళ్లకూడదు. దాన్ని తెరచి చూసే ప్రయత్నం చేయవద్దు. ఆ బ్యాగ్‌లో ఉగ్రవాదులు బాంబు పెట్టారని పోలీసులు అనుమానిస్తున్నారు. దేశంలో అన్ని ప్రధాన నగరాల్లో రెడ్ ఎలర్ట్ ప్రకటించారు. అందరు అప్రమత్తంగా వుంటూ ఎవ్వరూ లేనిచోట పడిఉన్న కొత్త వస్తువులను తాకకండి'' అని ప్రతి అయిదు నిముషాలకు ఒకసారి గ్రామ్ ఫోన్ రికార్డ్ పెట్టినట్లుగా ప్రకటన వినిపిస్తోంది.

ఒకటవ నెంబర్ ఫ్లాట్‌ఫాంలో ఆ బ్యాగ్‌వున్న బెంచీ దగ్గర ప్రయాణీకులు క్రిక్కిరిసి ఉన్నారు. ఒక ఎస్ఐ, పదిమంది కానిస్టేబుళ్లు లాఠీలతో అందరినీ వెనక్కు నెడుతున్నారు. ఎస్ఐ స్పీకర్లో ''ఒక అరగంటలో బాంబ్ టెస్టింగ్ స్క్వాడ్, పోలీస్ డాగ్స్ వస్తాయి. అంతవరకూ ఎవ్వరూ ఆ బ్యాగ్ వద్దకు వెళ్లద్దు'' అని హెచ్చరించాడు.

అక్కడ ప్రయాణీకుల్లో ఉన్న తల నెరిసిన అనుభవజ్ఞులు, మధ్య వయస్కులు, యువకులు ఉగ్రవాదం గురించి తమ అభిప్రాయాలు ఒకరితో ఒకరు పంచుకుంటున్నారు.

''హైదరాబాద్‌లోని లుంబినీ పార్క్‌లో, గోకుల్ చాట్‌లో ఉగ్రవాదులు పెట్టిన బాంబు పేలుళ్లకు కొందరు అమాయకులు చనిపోయారు. చాలామంది గాయపడ్డారు. ఈ బెంచీ మీద ఉండే హ్యాండ్ బ్యాగ్‌లో కూడా ఉగ్రవాదులే బాంబు పెట్టి ఉంటారు'' అన్నాడు ఒక ముసలాయన కళ్లద్దాలు సవరించుకుంటూ.

''హైదరాబాద్ ఒక్కచోటేనా? అహ్మదాబాద్, రాజస్థాన్, ఢిల్లీ, ముంబయ్, బెంగళూరుల్లో కూడా ఉగ్రవాదులు బాంబులు పేల్చారు'' అన్నాడు మరొకతను తలనెరిసిన పెద్దాయనకు వత్తాసు పలుకుతూ.

ఒక మధ్యవయస్కుడు కల్పించుకుని ''ఒకవేళ ఆ ఉగ్రవాదులు పట్టుబడినా, వాళ్లమీద పోలీసులు పెట్టిన కేసులు సంవత్సరాల తరబడి వాయిదా పడటం, ఆ వ్యవధిలో ఉగ్రవాదుల తరపున వాదించే లాయర్లు చట్టంలోని లొసుగులను ఆసరాగా తీసుకుని తమ తెలివి తేటలను వక్రమార్గంలో ఉపయోగించి వారిని విడిపించడమో, శిక్ష తక్కువపడేట్లుగానో చేస్తున్నారు'' అన్నాడు ఉపన్యాస ధోరణిలో.

''అసలు ఇటువంటి ఉగ్ర వాదుల్ని రష్యా, చైనాలాంటికమ్యూనిస్టు దేశాల్లో అయితే దొరికిన వెంటనే షూట్ చేసి పారేస్తారు'' అంటూ ఒక యువకుడు తన ఆవేశాన్ని వెళ్లగ్రక్కాడు.

''కానీ మన ప్రజాస్వామ్యంలో ఏ నేరానికైనా న్యాయస్థానం తీర్పు చెప్పి తగిన శిక్ష విధించాలి'' అన్నాడు ఒక లా స్టూడెంట్.

''అందుకే మన దేశంలో ఉగ్రవాదుల ఘాతుకాలు రోజురోజుకీ మితిమీరి పోతున్నాయి'' అని రాజకీయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తి తనఅభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇంతలో ఆ జనం దగ్గరకు కాఫీ, టీ, ఫలహారాలు అమ్మే వాళ్లు వచ్చి బాగా అమ్ముకుంటున్నారు. అప్పుడు పదిన్నరగంటలయింది. సుమారు పాతికేళ్ల స్త్రీ మూడేళ్ల పిల్లాడిని చంకలో పెట్టుకుని ఆ బ్యాగ్ వైపుకు కంగారుగానూ, హడావుడిగానూ, వేగంగానూ వెళ్తోంది.

''ఏయ్.. అమ్మాయ్.. అటు వెళ్లొద్దు.. ఆ బ్యాగ్‌లో బాంబు వుండొచ్చు. వెనక్కి వెళ్లు'' అని ఆమెకంటే ఎక్కువ కంగారుగా ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ఎస్ఐ హెచ్చరించాడు.

''ఆ బ్యాగ్‌లో బాంబు ఎందుకుంటుంది సార్. అది నా బ్యాగ్. అరగంట క్రితం ఇక్కడే బెంచీపైన కూర్చుని పక్కన బ్యాగ్‌ను పెట్టి మా అన్నతో సెల్‌లో మాట్లాడుతూ ఉన్నాను. ఆ సమయంలో మా పిల్లాడు ఇక్కడినుంచి వెళ్లిపోవడం నేను గమనించలేదు. తరువాత వాడు కనపడక పోయేసరికి కంగారుగా వాడిని వెతుక్కుంటూ వెళ్లాను. ఆ తొందరలో బ్యాగు ఇక్కడే మరిచి పోయాను. అలా వెతుక్కుంటా వెళ్లగా ఆ చివర ఇద్దరు పిల్లలతో ఆడుకుంటూ మావాడు కనిపించాడు. ఆ ఇద్దరు పిల్లల తల్లి నన్ను మందలించి మావాడిని అప్పగించింది. మా వాడు దొరికాక నాకు బ్యాగు సంగతి గుర్తొచ్చి పరుగున వస్తున్నాను'' అంది ఆమె.



ఆమె మాటల ధోరణిని బట్టి నిజమే అనిపించింది ఎస్ఐకి. అయినా వృత్తిరీత్యా అనుమానించడం సహజం కనుక ''సరే.. నీ పేరేమిటి? బ్యాగ్‌లో ఏమున్నాయి?'' అని అడిగాడు.

''నా పేరు విజయ. నేను బ్యాంక్ ఎంప్లాయిని. ఆ బ్యాగ్‌లో నా ఐడెంటిటీ కార్డు, పదివేల రూపాయల క్యాష్ ఉన్నాయి'' అందామె.

దీంతో ఎస్ఐ స్వయంగా ఆ బ్యాగ్‌ను తెరచి చూశాడు. అందులో ఆమె ఫోటో ఐడెంటిటీ కార్డు, పదివేల రూపాయల క్యాష్ ఉన్నాయి.

అతను ఆమెతో ''నీ బ్యాగ్ తీసుకోవచ్చు.. కానీ నీ పొరపాటు వలన మా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు అరగంట పని, దానికి మించి మాకూ ఈ ప్రయాణీకులకు టెన్షన్ కలిగించావమ్మా. ఇక ముందెప్పుడూ ఇటువంటి పొరపాటు జరక్కుండా జాగ్రత్త పడాలి'' అని సుతిమెత్తగా హెచ్చరించాడు ఎస్ఐ.

''ఇబ్బంది కలిగించిందానికి క్షమించండి. ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకుంటాను. ఇక్కడ మీరు జనాన్ని కట్టడి చేయడం వలన నా డబ్బు హ్యాండ్‌బ్యాగ్‌లో భద్రంగా వుంది'' అంది ఆమె.

ఆమె మాటలకు అక్కడున్నవారందరూ పకపకా నవ్వారు.

**– కూచిభట్ల శ్రీనివాస శాస్త్రి**